# ఫిలిం స్టార్ విరహిణి

శ్రీ వి. సువర్ణ

హల్లో మైడియర్ హజ్‌బెన్డ్!!!

నేను మీకు అనేకసార్లు కరుణారస పూరితమైన వైర్లిచ్చియున్నాను.... కాని యిప్పుడు నేను.... నాథా, మీకడకు సందేశము పంపుట కంతిమాధారమిదియే........రండి! వేగమే రండి!! గజేంద్రుని రక్షించుటకు, విష్ణువు వచ్చినటుల రండి!!!

నేను వందలకొలది లెటర్లు వ్రాస్తిని. నిజంగా మీరు లేకుండేసరికి నా జీవితమే "ఖరాబ"గుచున్నది. ఒక్కసారికూడా సమాధానమిచ్చుట లేదుగదా???

నా జీవితమనెడి మోటారు—పెట్రోల్,

నేను "లీగ" నైతే, తమరు జిన్నా: నేను ఆస్ట్రియానైతే హిట్లరు తమరే!!! ఒక్కపరి మీ హృదయ ఫలకమున నా వ్యధను రంగరించి చూడమని నా ప్రార్థన!....అలసించకండి....అబ్బబ్బ!!!

....నాథా. మీరేగనుక యిచ్చట వున్నట్లయితే, రాత్రింబగళ్ళు జెరిగే యెలుకల గడబిడకు నా కంత కష్టము లేకుండేది గదా? మీరేగనుక యిక్కడున్నటులైతే హిట్లరుగా భావించుకొనెడిదాన్ని. నేను హిట్లరు కోరికనై వెలసెడిదానను. అంతే!....యీ అభాగ్య బచ్చాలు, యీ సిగ్గులేని పిల్లలు, యీ దయారహిత డింభకులు. యీ నల్ల....నల్లటి యెలుకలు, యూదులై పొయ్యెడివారు.

నా సర్వస్వమా!

ఇప్పుడు నేను, కారం, కండ్లలో బెట్టుకొన్నప్పటికీ, కంటి వెంట నీరుకాదు, కాని యింత మాత్రమున, నేను యేడ్చుటలేదని తలంచవలదు. యేడుస్తున్నాను! రాత్రింబగళ్ళు యేడుస్తున్నాను!! భూన భోంతరాళాలు బ్రద్దలయ్యేలాగు యేడుస్తున్నాను!!! మీకు నమ్మికలేకుంటే సాక్ష్యంకూడా చెప్పిస్తాను, యిప్పుడు మన పొరుగున బట్టలు ఉతికే స్త్రీ వున్నది. అమె కొక గార్దభమున్నది, అదికూడా నాలాంటిదే అనుకుంటాను. సాయం సమయమున హాయిగా కళ్యాణిరాగ మాలాపించవలసిన స్థితి, కాని, ఆరున్నొక్కటి అలాపనచేస్తూవుంటుంది. వినండి, నాథా వినండి!....నా ప్రాణంకూడా తరుక్కుపోతుంది. ఆ గార్దభవ్యధలో నేనుకూడా లీనమైపోతూవుంటాను. ఆహా! నాథా, యిది యంతయు మీకు నమ్మికలేకుంటే సవిసయంగా ఆ గార్దభమును ప్రేమతో అడిగిచూడండి. నావ్యథను, విదితముచేయుట కిదియే సాక్షి?

ప్రియవరా,

నా పంకజ హృదయమున పీడిత విరహవ్యథ రేగినప్పుడు నేను అతి భయకంపితనైపోతుంటాను. తత్‌క్షణమున, శాంతిపొందుటకై "పుట్ పాత్"లో అటునిటు తిరుగుచూ, నిట్టూర్పులు విడుస్తూ, సిగరెట్లు పీలుస్తూ వుంటాను. అప్పటికీ నావ్యథ విడువకుంటున్నది!....కాని రండి! త్వరగా రండి!! వేగమేరండి!!! మీరు వెళ్ళగనే ...నేనొక స్టార్‌నైపోతినను కొనరండి???

నా సర్వస్వమా,

జ్ఞాపకమున్నదా? మీరిటనున్నపుడు నే నెంతలావుగావుండేదాననో! గాని....యిప్పుడు....యే క్ ద మ్ము న—గా లి లే ని ట్యూబునైపోతిని!

ఆ....ఆ....ఆ....ప్రజలేమంటున్నారంటే యిప్పుడు, రెట్టింపు లావు అయితివని? కాని ఆమాటలే మీరు విశ్వసించితే మూర్ఖులన్నమాట! నాథా, అయినప్పటికీ మీరు విశ్వసించకుంటే యిలా సమాధానం చెపుతాను: "మీరు యిచ్చట లేకుండుసరికి, యింటిపైనా, క్రిందా, లోనా, బైటా, ప్రక్కనా, అంతటా, తేనెటీగలు వాసము చేయుచున్నవి" అని, బస్: అంతే.

అబ్బబ్బ అగాధము

పళ్లెములు పాడైనవి! పవుడర్—స్నోల— పత్తాలేదు. చెప్పులు శిథిలములైనవి. రండి! తొందరగా రండి!!! యీ వస్తువుల చింతలోదప్ప —నేను హాకీ" ఆడుటకా, పోవుటలేదు.—టాకీ జూచుటకా పోవుటలేదు....

పలుకండి, మాట్లాడండి! తొందరగా మాట్లాడండి, ఒక్కసారి మాట్లాడండి—నే నీవిధంగానే పడియుండనా?... ప్రియవర?....ప్రియవర? అన్నింటి కన్నా దుఃఖకరమైన విషయమేమిటంటే "బుల్‌డాగ్"ను స్నానం చేయించి చాల రోజులైనది!!

రమ్ము, జీవనాధారా! రము!! బజారుపొమ్ము! నాకొరకు కోళ్ళను తెమ్ము! కాఫీ తయారుచేయుము! నాకు తినిపించుము—త్రాగించుము, క్లబ్బుకు తీసుకపొమ్ము ఆటలాడించుము, తమాషా చూస్తూ ఆనందిస్తూంటే, షొట్సుబజాయించుము!!!

అబ్బ, కఠిన శిలవుగదా! నేనెన్నిమాటలు జెప్పినప్పటికీ ఒక్క సమాధాన వాక్యమేని పలుకకుంటివి! మాట్లాడు! మాట్లాడండి!! మాట్లాడండి!!!

"యేమి మాట్లాడుతుంది బూడిద? తప్పుదారిని బడినది నేనుగాని"

"తప్పుదారియా?—అరే. యిదెటుల తప్పుదారి?"

"నా భార్యకూడా అప్పుడప్పుడూ యిదే విధమున ఫోన్ చేస్తుంటుంది. మీరు నన్ను క్షమించండి. నా భార్య్య అనుకొని యింతసేపూ విన్నాను!"

"అరే....! యిదేమి చోద్యము!!....మీరు నా ప్రాణనాధులుగారా!! నే నితరులను భర్తగా తలంచుచున్నానా?....కా....కా....కా....దు,! మీరు అబద్ధము పలుకుచున్నారు నాకు యింటినంబరు గుర్తులేదనుకున్నారా? యీ నంబరుగల యింటిలోనే నా భర్త నివాసము."

వ్యర్థంగా మూర్ఖపు పట్టుదల యెందుకు వడతారు?"—"

"బస్—నేను గ్రహించాను మీరు నా ప్రియులే, నాతో మనోవినోదం కొరకు పలికే పలుకులివి? అంతే....?"

"యేమన్నావు? నేమ నీ మగడనా?? బాబయ్యో....? దేవీ దయవుంచి యీమాటే మళ్ళీ అనకు—నా గృహిణి, గద్దరి—అది గనుక వింటే....?"

దేవీజీ?——త మ రు వ్య ర్థ ం గా నన్నెందులకు కష్టపెట్టెదరు. నేను మీ భర్తనుగాను, యిది అద్దెయిల్లు. యీ యింటిలో నేను, నిన్ననే ప్రవేశము, నేనువచ్చి ప్రవేసించేముందు ఒకాయన వుండేవాడు. ఆయన అద్దెయివ్వకుండే సరికి, యజమానివచ్చి ఖాళీచేయించినాడు. ఒకవేళ ఆ వెళ్ళిపోయిన మహాశయుడేమో తమ భర్తగారు???

టన్—టన్—టన్